క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పుల్లంపేట : మండల పరిధిలోని వత్తలూరు గ్రామంలో గురువారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన రామాలయంలో వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకు ముందు యజ్ఞోపవీతం, కలశ స్థాపన తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి భక్తులకు అన్నసంతర్పం చేశారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

పెనగలూరు : నవోదయ విద్యాలయానికి మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓలు గిరి వరదయ్య, సుబ్బరాయుడులు తెలిపారు. గాయత్రి పాఠశాల నుంచి హర్షిత, ఇండ్లూరు గ్రామం నుంచి ఆదాల అస్మితలు ఎంపికయ్యారన్నారు. గురువారం విద్యార్థిని హర్షితను ఎంఈఓలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హరిప్రసాద్, చంద్రశేఖర్, హర్షిత తల్లిదండ్రులు శ్రీదేవి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా సీతాపురం జట్టు

నందలూరు : మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన శ్రీ మంచాలమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన మంచాలమ్మ క్రికెట్ టోర్నీని గురువారం ఆడపూరు, ఒంటిమిట్ట మండలం సీతాపురం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన సీతాపురం 142 పరుగులు చేయగా ఆడపూరు జట్టు 134 పరుగులు మాత్రమే చేయడంతో 8 పరుగుల తేడాతో సీతాపురం జట్టు విజేతగా నిలిచింది. బహుమతులను నిర్వాహకులు రాజా, రిషీ, భాను ప్రకాష్, నాగరాజులు అందజేశారు.

6న సీపీఎం జాతీయ మహాసభలు

రాజంపేట రూరల్ : తమిళనాడులోని మదురైలో ఈ నెల 6వ తేదీన నిర్వహించే సీపీఎం 24వ జాతీయ మహాసభలను జయప్రదం చేసుకుందామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్వేలి రవికుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం సీపీఎం నాయకులతో కలిసి రవికుమార్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి ఈ మహాసభలలో సీపీఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు తెలియజేశారు. ప్రజల పక్షాన పోరాటాలు ఏ విధంగా చేపట్టాలో ఈ మహాసభలో తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పందికాళ్ల మణి, మండల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీలోని చాముండేశ్వరిపేట గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీఓ నరసింహులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్‌ను తనిఖీ చేపట్టగా 32 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో భాగంగా కూలీలతో మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలని, నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే ప్రతి కూలీకి రూ. 3 వందలు వస్తుందన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గంగ జాతరలో దాతల దాతృత్వం

రాజంపేట టౌన్ : పట్టణ పరిధిలోని బలిజపల్లెలో గురువారం జరిగిన గంగమ్మ జాతర సందర్భంగా దాతలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వేకువజాము నుంచే వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున జాతరలో పాల్గొనడం ప్రారంభమైంది. భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు అడుగడుగునా అన్నదానాలు, మజ్జిగ, నీళ్లు, జ్యూస్, వివిధ రకాల ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఇదిలావుంటే శ్రీవారి భక్తసేవా సమితికి చెందిన మహిళలు విభిన్నంగా కళింగర కాయ ఒప్పులను పంపిణీ చేశారు. కాగా బద్వేలి సుబ్బరాయుడు చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు.

7న చలో తిరుపతిని జయప్రదం చేయండి


రాయచోటి అర్బన్ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7వ తేదీన తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ ఆఫీసు ఎదుట చలో తిరుపతి పేరుతో నిర్వహింప తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ విజ్ఞప్తి చేశారు. యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా పోస్టర్‌లను ఆయన కార్మికులతో కలసి విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు నిరసనగా 7వ తేదీ తిరుపతిలో నిర్వహింపతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, నాగేష్‌గౌడ్, గజేంద్రనాయుడు, రామాంజులు, శ్రీధర్, మల్‌రెడ్డి, రామాంజులురెడ్డి, విశ్వనాథ్, ప్రతాప్, సునీల్, జగదీష్, రెడ్డెప్ప, ఖాదర్‌బాషా, డివిజన్ నేతలు డి.వి.రమణ, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పరిశ్రమలకు ఆల్విన్ స్థలం వరం

- అందుబాటులో మౌలిక వసతులు ఉన్న 305 ఎకరాల జాగా
- ప్రభుత్వం చొరవ చూపాలంటున్న స్థానికులు



ఆల్విన్ కర్మాగార శిలాఫలకం


నందలూరులో మూతపడిన ఆల్విన్ కర్మాగారం

నందలూరు : చెన్నై – ముంబై ప్రధాన రైలు, రోడ్డు మార్గానికి అనుసంధానించి ప్రస్తుతం ఎక్కడా భారీ పరిశ్రమ ఏర్పాటు చేసేంత స్థాయిలో వందల ఎకరాలు ప్రభుత్వ భూమి లేదు. నందలూరు మండల కేంద్రంలోని పాత ఆల్విన్ రీ ఫ్రిజరేటర్ల కర్మాగారం స్థలం మాత్రం దీనికి మినహాయింపుగా కనబడుతుంది. ఇక్కడ పాత ఆల్విన్ కర్మాగారానికి సంబంధించి 305 ఎకరాల ప్రభుత్వ భూమి ఎవరు తనను సద్వినియోగం చేస్తారా అని ఎంతోకాలంగా ఎదురుచూస్తోంది. కొన్ని కారణాలతో ఆల్విన్ కర్మాగారం ప్రైవేటు పరమైంది. ఇప్పటికీ ఈ స్థలం మాత్రం ప్రభుత్వానిదే. దాదాపు గత కొన్నేళ్ల క్రితం అల్విన్ కర్మాగారాన్ని కొనుగోలు చేసిన వారు ఇన్నేళ్లుగా కర్మాగారం పునరుద్ధరణకు గానీ, ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటుకు గాని యత్నించిన దాఖలాలు లేవు. కొందరు పారిశ్రామిక వేత్తలు ఈ కర్మాగారాన్ని కొనేందుకు ముందుకు వచ్చినా ప్రస్తుత యజమాని అధిక ధర చెప్పడంతో వెనుతిరిగి వెళ్లారనే సమాచారం. మరోవైపు జిల్లా రాజకీయ నేతల అండతో ఈ భూమిని స్థిరాస్తి వ్యాపారానికి వినియోగించేందుకు యత్నించగా స్థానికులే అడ్డుకున్నారు. కర్మాగారం మూతపడటంతో ఇప్పుడు ఈ ప్రాంతం పాడుబడిన భవనాలతో అసాంఘిక శక్తుల క్షేత్రంగా సాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆల్విన్ రీ ఫ్రిజిరేటర్ల కర్మాగార స్థలం కడప – చెన్నై ప్రధాన రైలు, రోడ్డు మార్గంలో ఉంది. ఈ స్థలం చెన్నైకు 250 కిలోమీటర్లు, రేణిగుంట విమానాశ్రయానికి 100 కిలోమీటర్లు, కడప విమానాశ్రయానికి 50 కిలోమీటర్ల దూరం ఉంది. నందలూరులోనే రైల్వే సదుపాయం ఉంది. ఇలా అన్ని రకాలుగా ఈ స్థలం ఏ భారీ పరిశ్రమకైనా ఎంతో అనుకూలంగా ఉంది. మాజీ ఎంపీ సాయి ప్రతాప్ కేంద్ర ఉక్కు గనుల సహాయ మంత్రిగా ఉన్నప్పుడు నందలూరు రైల్వే కేంద్రంలోని పాత రైల్వేలోకో షెడ్ స్థలాన్ని, ఈ ఆల్విన్ కర్మాగార స్థలాన్ని కలిపి భారీ స్థాయిలో బీహెచ్‌ఈఎల్ ఆధ్వర్యంలో కర్మాగారం ఏర్పాటు చేసేందుకు యోచించారు. ఈ మేరకు కేంద్ర అధికారుల బృందం వచ్చి స్థల పరిశీలన కూడా చేసి వెళ్లింది. రైల్వే, జాతీయ రహదారులకు చాలా దగ్గరగా ఆల్విన్ స్థలం భారీ కర్మాగారాలకు ఎంతో అనుకూలమని, అప్పట్లో సదరు కేంద్ర అధికారుల బృందం వ్యాఖ్యానించింది కూడా. అయితే ఆ తరువాత సాయి ప్రతాప్ మంత్రి పదవి కోల్పోగా ఆ ప్రతిపాదనకు అప్పుడే ఫుల్‌స్టాప్ పడింది. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నందలూరులో ఆల్విన్ కర్మాగారం ఏర్పాటు చేసి వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఆ తరువాత వచ్చిన పాలకులు ఈ కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయడమే కాక మూతపడేలా వ్యవహరించారనే అపవాదను మూటకట్టుకున్నట్టు స్థానికులు వాపోతున్నారు. రాష్ట్రంలో మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో మళ్లీ ఇక్కడ భారీ పరిశ్రమను ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం ఈ స్థలంపై దృష్టి సారించి కొత్తగా ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమ లేదా విద్య, వైద్య వైజ్ఞానిక పరిశోధన శిక్షణ సంస్థను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో అన్ని రకాల మౌలిక వసతులు పుష్కలంగా నీటి వసతి ఉన్న ఈ స్థలంలో ఏదైనా ప్రత్యామ్నాయ భారీ పరిశ్రమ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థనైనా ఏర్పాటు చేసి స్థానికులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించాలని స్థానికులు ఆశిస్తున్నారు.

ఆల్విన్ సంస్థ పుట్టుపూర్వోత్తరాలు

1983లో ప్రభుత్వ రంగ సంస్థగా ప్రతిపాదించడం జరిగింది. 1984లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారు. 1984–87లో కర్మాగారం పూర్తయ్యింది. 1989–90లో కర్మాగారంలో ఉత్పత్తి మొదలైంది. 800 మంది కార్మికులు, సిబ్బంది ఉండగా 240 మంది కార్మికులకు నివాస భవనాలు ఏర్పాటు చేశారు. 1999లో ఓల్టాస్, 2001లో ఎలక్ట్రోలక్స్ కర్మాగారం మూసివేయడం జరిగింది.

కర్మాగారాన్ని పునరుద్ధరించాలి



అన్ని వసతులు, సౌకర్యాలు కల్గి మూతపడిన ఆల్విన్ కర్మాగారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పునరుద్ధరించాలి. కర్మాగారం మూతపడటంతో రోడ్డున పడిన కార్మికులకు మెరుగైన జీవనోపాధి కల్పించాలి. నిరుద్యోగులకు అండగా ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.
– సోమిశెట్టి ప్రభాకర్, నందలూరు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి



అల్విన్ స్థలం భారీ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉన్న కారణంగా స్థానిక నాయకులు దృష్టి సారించి పరిశ్రమ లేదా ప్రత్యామ్నాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. దీంతో స్థానిక నిరుద్యోగులకు భరోసా కల్పించడమే కాక పరోక్షంగా పరిశ్రమ ఆధారంగా జీవించేలా చర్యలు తీసుకున్నట్టు అవుతుంది.
– పల్లె గ్రీష్మంత్ రెడ్డి, వైఎస్సార్ సిపి యువజన నాయకుడు, నందలూరు

మా భూములు మాకు ఇప్పించండి



స్థానికంగా ఉపాధి కలుగుతుందనే ఆశతో మాకు మంజూరు చేసిన భూమిని ఆల్విన్ కర్మాగారం కోసం ఇచ్చాం. ఆ భూమికి సంబంధించి మాకు నష్టపరిహారం ఇవ్వలేదు. కర్మాగారంలో ఉద్యోగాలు కల్పించలేదు. కర్మాగారాన్ని మూసివేసిన నేపథ్యంలో కర్మాగారం కోసం ఇచ్చిన మా భూముల్ని తిరిగి ఇచ్చేస్తే మేము వ్యవసాయం చేసుకొని జీవిస్తాం.
– వేపకుంట శ్యామ్రాజ్, నందలూరు

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

రాజంపేట టౌన్ : ఈనెల 30వ తేదీ జరిగే పాలిసెట్ పరీక్ష రాయనున్న అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగూర్ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆకేపాడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 4వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. నిపుణులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారని తెలియజేశారు. వివరాలకు 78930 64217 నెంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు బాధ్యతగా భావిద్దాం

రాజంపేట రూరల్ : వేసవి కాలంలో ఉచిత చలివేంద్రాల ఏర్పాటు చేయటాన్ని ప్రతి ఒక్కరం బాధ్యతగా భావిద్దామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట గురువారం విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఈ ప్రారంభించారు. ఈ చలివేంద్రంలో చల్లని మజ్జిగ, చల్లని నీరు ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖరరెడ్డి, డీఈఈలు, ఏఈలు, కార్మికులు పాల్గొన్నారు.

చత్రపతి శివాజీకి ఘన నివాళి


శివాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం చత్రపతి శివాజీ వర్థంతి వేడుకలు ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు చత్రపటి శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. భరతమాత ముద్దుబిడ్డ, మొగల్ రాజులను ఎదిరించి మరాఠా సామ్రాజ్య స్థాపన చేసిన వీరుడు శివాజీ అని ఉపాధ్యాయుడు రమణ తెలియజేశారు.

ప్రైవేటు ఆస్తులపై ప్రభుత్వ పెత్తనం ఎందుకు?

- ముస్లింలను కూటమి పార్టీలు వంచించాయి
- వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్


మాట్లాడుతున్న బేపారి మహమ్మద్‌ఖాన్

రాయచోటి అర్బన్ : వక్ఫ్ బోర్డుకు చెందిన ప్రైవేటు ఆస్తిపై ప్రభుత్వ పెత్తనం ఎందుకు? అని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ ప్రశ్నించారు. ముస్లిం, మైనార్టీల మనోభావాలు దెబ్బతినే విధంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు చట్టం తీసుకురావడానికి ప్రయత్నిస్తుండడం దుర్మార్గమన్నారు. గురువారం సాయంత్రం ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మైనార్టీ నేతలతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వానికి సంబంధం లేని ప్రైవేటు ఆస్తులు, తమ పూర్వీకులు అల్లాహ్ పేరుతో వక్ఫ్‌కు దానం చేస్తే ఆ ఆస్తులను కూటమి ప్రభుత్వం తన గుప్పిట్లోకి తీసుకోవాలని చూస్తుండడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నించారు. ముస్లిం, మైనార్టీలకు మేలు చేస్తామని అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీలు నయవంచనకు పాల్పడుతుండడం దారుణమన్నారు. 2024 వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మైనార్టీలు అభద్రతాభావానికి లోనవుతున్నారన్న కారణంతో వైఎస్‌ఆర్‌సీపీ బిల్లును వ్యతిరేకించిందన్నారు. జగన్ ఆదేశాల మేరకు వక్ఫ్ బిల్లు సవరణ కాదు అసలు బిల్లు వద్దంటూ ఎంపీ మిథున్‌రెడ్డి ఒంటరి పోరాటం చేస్తున్నారన్నారు. ముస్లింలను నమ్మించి మోసం చేసిన టీడీపీ, జనసేనలకు త్వరలోనే మైనార్టీ సమాజం తగురీతిలో గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో సలీం నవాజ్, రియాజ్ అహమ్మద్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పెనగలూరు : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. గురువారం మండలంలోని కోడి చెన్నయగారిపల్లి గ్రామంలో భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా పంటలకు రసాయన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా భూసార పరీక్షా కేంద్రం నుంచి కవిత, విజయభారతీలు ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు రైతులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి రైతు సీజన్‌లో పంటలు వేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలో ఏయే పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుస్తాయన్నారు. దాన్నిబట్టి ఎంతమేర రసాయన ఎరువులు వాడాల్సి ఉంటుందో రైతులకు తెలుసుకోవచ్చన్నారు.

రేపు జేసీజే మోడల్ పరీక్ష

రాయచోటి అర్బన్ : ఈనెల 5న తమ సంఘం ఆధ్వర్యంలో కడప కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే) మోడల్ పరీక్షను యువ న్యాయవాదులంతా సద్వినియోగం చేసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వర్, రాష్ట్రకమిటీ సభ్యుడు ఆనంద్ కుమార్‌లు పిలుపునిచ్చారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహింపబడుతుందన్నారు. మోడల్ పేపరు ఏఐఎల్‌కు చెందిన రిటైర్డ్ జడ్జిలు, సీనియర్ న్యాయవాదులు తయారుచేశారన్నారు. పేర్ల నమోదుకు 70137 40055, 99633 28876 నంబర్లకు ఈనెల 4వ తేదీ సాయంత్రంలోపు సంప్రదించాలంటూ కోరారు.

విద్యార్థుల కలలు ఉన్నతంగా ఉండాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఎఫ్‌ఓ జగన్నాథ్‌సింగ్

రాజంపేట రూరల్ : ప్రతి విద్యార్థి తమ కలలను ఉన్నతంగా ఉండాలని జిల్లా ఫారెస్టు అధికారి ఆర్.జగన్నాథ్‌సింగ్ అన్నారు. స్థానిక చెర్రీస్ హైస్కూల్‌లో ప్రథమ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రాత్రి ఎండీ రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలో ముఖ్య అతిథులుగా జిల్లా ఫారెస్టు అధికారి, అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేలు పాల్గొని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎన్నుకునే లక్ష్యం ఎంతో ఉన్నతంగా ఉండాలన్నారు. ఆ లక్ష్యం కోసం అహర్నిశలు కష్టపడాలని పిలుపునిచ్చారు. దేశంలో నాకు రాకపోతే ఫస్ట్ ర్యాంక్ ఎవరికి రాకూడదనే విధంగా విద్యనభ్యశించాలన్నారు. చదువుతోపాటు ఆరోగ్యం ప్రధానమని, ఇందుకోసం యోగా, వ్యాయామం సాధన చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలంరించాయి. వేడుకలలో కరస్పాండెంట్ రాఘవరెడ్డి ప్రేమలత, చైర్మన్ చందనకుమార్‌రెడ్డి, ట్రెజరర్‌లు హారిక, చర్విత, సీఈఓ ఎం.రంగప్రసాద్, ఎంఈఓ కొండూరు. రఘునాథరాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై తప్పుడు కేసులు పెట్టాలంటూ పోలీసులపై ఒత్తిడి

వీరబల్లి : మండల పాత్రికేయులపై ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు కేసులు బనాయించాలంటూ కేఎం పల్లికి చెందిన కాల్వపల్లి నాగ వెంకటరమణ, వంగాడి ప్రభాకర్ బాబు, వంగాడి చెన్నయ్య, వంగాడి రమణమ్మ, పలువురు నాయకులు స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్‌ను పట్టుబట్టారు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా వారిని తిట్టినట్లు పేర్కొంటూ అట్రాసిటీ కింద కేసులు బనాయించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే పలువురు విలేకరులపై అక్రమంగా కేసు నమోదు చేయించిన సంఘటనలు మండలంలో ఉన్నాయి. ఇలా తప్పుడు కేసులు పెట్టాలని ప్రోత్సహించే వారిపట్ల జిల్లా పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని విలేకర్లు కోరుతున్నారు. ఇటీవల ప్రభుత్వ భూమి సర్వే నెంబరు. 575లో పాత్రికేయులకు ఇంటి పట్టాలు, శీతల గోడౌన్, వెలుగు గోడౌన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. అలానే టిటిడి కళ్యాణ మండపానికి భూమిపూజ చేశారు. అప్పట్లో స్పందించని వారు ప్రస్తుతం ఎటువంటి పత్రాలు లేకుండా ఆ భూమి మాదంటూ భూమి కాజేసేందుకు పావులు కదుపుతున్నారు. దీంతో అడ్డుతగులుతున్న పాత్రికేయులపై కేసులు బనాయిస్తే పారిపోతారనే ఉద్దేశంతో మండల పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ విషయం పట్ల జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి తప్పుడు కేసులు బనాయించకుండా విచారణ జరిపి చర్యలు చేపట్టాలని విలేకరులు విన్నవించారు.

రాయచోటిలో రెచ్చిపోతున్న యువత



స్కూటీపై స్టంట్‌లు వేస్తున్న యువకులు

రాయచోటి : పెద్దలు చెప్పినట్లుగా రౌతు మెత్తబడితే గుర్రం మూడు కాళ్ల మీద నడుస్తుందన్న సరదా వ్యాఖ్యలకు అచ్చుగుద్దినట్లుగా అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పోలీసుల మెతక వైఖరి ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. పట్టణంలో విచ్చలవిడిగా లభిస్తున్న గంజాయిని సేవిస్తూ, గ్యాంగులుగా మారి దాడులు, ప్రతి దాడులతో పట్టణ ప్రజలను భయకంపితులను చేస్తున్నారు. ఈ కోవలోనే యువ ఆకతాయిలు ప్రధాన రహదారులు, వ్యాపార వీధులలో బైకులపై స్టంట్లు వేస్తూ రెచ్చిపోతున్నారు. గత కొన్ని నెలలుగా రాయచోటిలో ఆకతాయిలు బైకులు, ఆటోలు, కార్లతో చేస్తున్న స్టంట్లు తారాస్థాయికి చేరాయి. పది రోజుల కిందట పీకలదాకా మద్యం సేవించిన ఆటో డ్రైవర్ ఆటోతో నేతాజీ సర్కిల్‌లో వేసిన స్టంట్లు అక్కడి ప్రజలు, ప్రయాణీకులలో వణుకు పుట్టించింది. రెండు రోజుల కిందట కొత్తపేట మార్గంలో ఇద్దరు యువకులు బైకుపై జరిగిన స్టంట్ ఆ ప్రాంత ప్రజలను పరుగులు తీయించి ఇక రింగ్ రోడ్డు, చిత్తూరు, మదనపల్లి, కడప రోడ్లలో ఆకతాయిలా అల్లర్లకు అడ్డూ అదుపు లేదనే చెప్పాలి. గురువారం సాయంత్రం మదనపల్లి మార్గంలో ఇద్దరు యువకులు స్కూటీపై చేసిన స్టంట్‌తో చిన్న పొరపాటు జరిగిన స్టంట్ చేసిన యువకులతోపాటు ఎదురుగా వాహనాల్లో వస్తున్న వారికి ప్రమాదంతోపాటు ప్రాణాలను పొగొట్టుకోవాల్సిందే అన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

సిద్దవటం : ఖరీఫ్‌లో రైతులు సాగుచేసుకొని పంటలకు పచ్చిరొట్ట ఎరువు విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి వాటిని రైతులకు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి, మాధవరం–2 రైతు సేవా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు.

పారిశుధ్య పనులు వేగవంతంగా చేయాలి


జేఎంజే వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న కూలీలు

సిద్దవటం : ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకొని సిద్దవటం మండలంలోని కడప–చెన్నై ప్రధాన రహదారి జేఎంజే కాలేజీ నుంచి రహదారికి ఇరువైపుల ఉన్న ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల తొలగింపు పనులను వేగవంతంగా చేయాలని డీఎల్‌పీఓ విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ గురువారం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా డీపీఓ ఆదేశాల మేరకు మండలంలోని హైవేపై రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలను, ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించే పనులు చేయిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఉప్పరపల్లె గ్రామంలో 30 మంది కూలీలలో, జేసీబీ యంత్రాలతో పనులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బద్వేల్ డీఎల్‌పీఓ రమణారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలోని పలు మండల పార్టీ కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వాటి వివరాలిలా ఉన్నాయి.

నందలూరు మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఎ.వేణుగోపాల్, షేక్‌షా వలీ, ప్రధాన కార్యదర్శులుగా నాగశ్రీనివాసులు, డి.నరసారెడ్డి, ఎ.నాని, కార్యదర్శులుగా సి.వెంకటయ్య, బి.నారాయణ, కె.సుధాకర్, వి.మోషే, జి.గోపాల్‌రెడ్డి, సభ్యులుగా జి.రవికుమార్, జి.అశోక్, ఎస్.ఖాజాహుస్సేన్, వై.శివప్రసాద్, ఇలియాస్, వెంకట రమణలను నియమించారు.

రాజంపేట మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా గురుమూర్తి, వెంకటరామ నాయుడు, ప్రధాన కార్యదర్శులుగా చంద్రరాజు, బి.సుబ్బారెడ్డి, మధు, జయరామయ్య, కార్యదర్శులుగా ఆర్‌సీ పెంచలయ్య, కె.నరసింహ, వీరయ్య, సురేంద్ర, కె.రఘు, సభ్యులుగా అమీర్‌బాషా, రవీంద్ర, హరినాథరెడ్డి, చిన్న నరసింహులు, సురేష్, శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సంతోష్, సుబ్బనరసయ్య, కృష్ణారెడ్డి, శేఖర్, అమర, వేణుగోపాల్‌రెడ్డిలను నియమించారు.

రాజంపేట మున్సిపల్ పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా బి.కొండయ్య, ఎస్.హబీబుల్లా, ప్రధాన కార్యదర్శులుగా కె.అమర్‌నాథరెడ్డి, సి.జ్యోతి కృష్ణ, పి.మల్లికార్జున, ఎస్.శ్రీనివాసులు, కార్యదర్శులుగా ఇ.రామకృష్ణ, శివప్రసాద్‌గౌడ్, రసూల్, ప్రతాప్ ఆచారి, గురుఆచారి, సభ్యులుగా వి.కిశోర్, కనకయ్య, దిలీప్, అక్బర్, షాకీర్‌బాషా, మహేష్‌బాబు, శివశంకర్, సుబ్రమణ్యం, ధర్మయ్య, గంగయ్య, రెడ్డిప్రసాద్, నాగరాజు, ఎన్.నాగరాజు, హర్షవర్దన్, వెంకటరమణ, రమణ, రెడ్డెయ్య, పెద్దరెడ్డయ్య, సుబ్బరాజు, నరేంద్రబాబు, శివప్రసాద్, షఫీవుల్లా, రాజా, వెంకటేశ్, బిల్లానాగరాజు, మురళి, జాఫర్, మహమ్మద్ రఫీలను నియమించారు.

సిద్దవటం మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఎం.శివరామిరెడ్డి, శివయ్య, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులురెడ్డి, జె.శివారెడ్డి, బి.లక్ష్మిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శులుగా కె.సుబ్బారెడ్డి, కె.రమణ, ఎం.ప్రసాద్, సభ్యులుగా ఎం.రామిరెడ్డి, కె.వెంకట సుబ్బయ్య, ఎం.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, వెంకట శంకర్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, పి.మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, బి.ఉమామహేశ్వర్, సుబ్బరాయుడు, కృష్ణ, వెంకట సుబ్బారెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఎస్.రాయుడు, మల్లేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, పి.కొండారెడ్డి, కె.ఈశ్వర్, ఎం.శివప్రసాద్, ఎస్.రవిలను నియమించారు.

టి.సుండుపల్లె మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఆర్.రెడ్డిశేఖర్, ఎస్.హజీంసాహెబ్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రవికుమార్‌రెడ్డి, ఎస్.లక్ష్మినారాయణరెడ్డి, వై.అమరేష్, సి.సుబ్బరామరాజు, కార్యదర్శులుగా సి.ఓంకార్, డి.మహేశ్వర్‌రెడ్డి, ఆదాం ఖాన్, బి.చిన్నానాయక్, ఎ.నాగార్జున, సభ్యులుగా బి.ప్రసాద్‌నాయక్, ఎం.గోవర్దన్‌నాయక్, రెడ్డెమ్మ, వై.హరినాథరెడ్డి, బి.శంకరయ్య, అశోక్, ఎం.సాగర్‌రెడ్డి, కె.భాస్కర్, ఎం.నాగార్జునరెడ్డి, ప్రసాద్, సి.భార్గవ్, సుధాకర్, జయరామయ్య, వై.వినోద్‌కుమార్‌రెడ్డి, వి.అజయ్‌కుమార్‌రెడ్డి, పి.సోమశేఖర్‌రెడ్డి, ఎస్.షకూర్, ఎస్.వీరభద్ర, ఎస్.రషీద్, జి.ప్రభాకర్‌నాయుడులను నియమించారు.

వీరబల్లి మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా బి.రామచంద్రారెడ్డి, కె.నరేంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.రామాంజులరెడ్డి, కె.సీతారామరాజు, టి.విశ్వనాథరెడ్డి, ఎస్.తిమ్మారెడ్డి, కార్యదర్శులుగా సి.వెంకట రామరాజు, రెడ్డిశేఖర్‌రెడ్డి, బి.రమణ, ఎస్.హసన్‌బాషా, పెంచలయ్య, సభ్యులుగా సురేంద్రరాజు, నరసింహులు, కె.నరసింహులు, సి.బాలకృష్ణరాజు, ఎస్.సలీం, ఆర్.రామాంజులు, ఎస్.దర్బార్‌బాషా, రెడ్డెయ్య, చంద్రబాబునాయుడు, సురేంద్ర, పల్లం రమణ, ప్రభాకర్‌నాయుడు, మల్లేష్‌గౌడ్, ధర్మారెడ్డి, కె.భూషణ, కె.రాంప్రసాద్‌నాయుడు, ఇబ్రహీం, సుబ్బన్న, టి.రామకృష్ణ, పి.నరసింహులులులను నియమించారు.

ఒంటిమిట్ట మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా డి.సుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా జి.నారపరెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి, కె.శివ, పి.చంద్రశేఖర్‌రాజు, కార్యదర్శులుగా ఎ.సుబ్బారెడ్డి, గంగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సభ్యులుగా పి.ఎరికలరెడ్డి, అబ్దుల్లా, కె.రాజా, డి.వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, బాబు, పీరన్, బుస్సా, జి.నరసింహారెడ్డి, ఎస్.శివారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎన్.శంకర్‌రెడ్డి, సి.విశ్వనాథ్, సయ్యద్ జాఫర్, తల్లిరావు, నరసింహారెడ్డి, సుధాకర్‌యాదవ్, ఇస్మాయిల్, మహేష్‌రెడ్డి, సుజాతలను నియమించారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

నందలూరు : స్థానిక నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యారంగ పోటీలను ఎంఈఓ ఎల్.నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు విద్యారంగ పోటీల్లో పాల్గొని పోటీతత్వం పెంపొందించుకోవాలని కోరారు. నందలూరు హైస్కూల్ హెడ్ మాస్టర్ షేక్ రౌఫ్ బాషా, నాగిరెడ్డిపల్లి హెడ్ మాస్టర్ జయలలిత కుమారి మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి ముందస్తు వేడుకల్లో భాగంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం హర్షనీయమని కొనియాడారు. యూటీఎఫ్ మండల నాయకులు ముక్కర హరినాథ్, రమేష్ జోషి, జి.కృపానందం, వి.సుధాకర్, కె.ఆనంద్, ఆరెం చిన్న రెడ్డప్పలు మాట్లాడుతూ వ్యాసరచన, వకృత్వ పోటీలకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు 50 మంది పాల్గొనడం అభినందించదగ్గ విషయమన్నారు. సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.చంద్ర కుమార్, పి.భరత్ కుమార్, సుబ్బలక్షుమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

సంబేపల్లె : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రౌతుకుంటలో జరుగుతున్న మలాథియన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, సీహెచ్‌ఓలు సదాశివారెడ్డి, రాణి, ఎల్‌టీ శివ, సిబ్బంది సాయిలీల, అమరావతిలు పాల్గొన్నారు.